క్లుప్తంగా

10వరకు గడువు

మహబూబాబాద్ అర్బన్: ఓపెన్ టెన్త్, ఇంటర్ వార్షిక పరీక్ష ఫీజు చెల్లింపునకు తేదీలు ఈనెల 2వ తేదీ నుంచి 10వ తేదీ వరకు అపరాధ రుసుము లేకుండా పరీక్ష ఫీజు చెల్లించవచ్చని డీఈఓ పి.రామారావు తెలిపారు. పరీక్ష ఫీజు రూ.25తో ఈనెల 11వతేదీ నుంచి 16వ తేదీ వరకు చెల్లించాలని, 17వ తేదీ నుంచి 22వ తేదీ వరకు రూ.50 ఫైన్‌తో పరీక్ష ఫీజులు చెల్లించాలని బుధవారం తెలిపారు. చలాన్, డీడీ చెల్లింపులు ఆమోదించబడదని, ఓపెన్ టెన్త్, ఇంటర్ వార్షిక పరీక్షలు ఏప్రిల్, మే నెలలో ఉంటాయన్నారు.

జాతర ప్రారంభం



గూడూరు: మండలంలోని దామరవంచ సమీప జాతీయ రహదారి పక్కన చింతలగట్టు ఒట్టివాగు ఒడ్డున వెలసిన సమ్మక్క సారలమ్మ మినీ జాతర బుధవారం ప్రారంభమైంది. ఉదయం జాతర కమిటీ నిర్వాహకులు, పూజారులు జాతర ప్రదేశంలో మకరతోరణాలతో అలంకరించారు. గద్దెల వద్ద పూజలు చేసి, భక్తులు అమ్మవార్లకు మొక్కులు చెల్లించుకున్నారు.

దర్వాజ ప్రతిష్ఠాపన పూజలు



కురవి: మండల కేంద్రంలోని పెద్ద చెరువు కట్ట వద్ద యాదవ కులస్తుల ఆరాధ్యదైవం గంగమ్మ తల్లి ఆలయ నిర్మాణంలో భాగంగా దర్వాజ ప్రతిష్ఠ కార్యక్రమం వేద పండితుల వేద మంత్రోచ్చరణల నడుమ బుధవారం సాగింది. ఆలయ దర్వాజను పుణ్యపుర్తి వెంకటయ్య-కళమ్మ జ్ఞాపకార్థం అతని కుమారుడు పుణ్యపుర్తి రాము రూ.30వేలు అందించగా ప్రతిష్ఠ చేశారు. వీరభద్రస్వామి ఆలయ మాజీ చైర్మన్ సోమిశెట్టి శ్రీనివాస్ రూ.10,116 విరాళాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ గుగులోత్ పద్మావతిరవినాయక్, జెడ్పీటీసీ బండి వెంకటరెడ్డి, వీరభద్రస్వామి ఆలయ ఈఓ సత్యనారాయణ, ఆలయ చైర్మన్ బాదావత్ రామునాయక్, సర్పంచ్‌లు మూడు అరుణశ్రీను, రవి, శ్రీను, ఎంపీటీసీ చిన్నంభాస్కర్, వార్డు సభ్యులు వెంకన్న, లక్ష్మణ్, శ్రీనివాస్, మోకరి వెంకన్న, మాజీ చైర్మన్ బాదావత్ రాజునాయక్, ధర్మకర్తలు పాల్గొన్నారు.

వైభవంగా కల్యాణ వేడుక



డోర్నకల్: స్థానిక బ్యాంక్ స్ట్రీట్ వేంకటేశ్వరాలయంలో జరుగుతున్న 16వ బ్రహ్మోత్సవ వేడుకల్లో శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణ వేడుకలు వైభవంగా జరిగాయి. ఆలయ ఆవరణలో ఎదుర్కోలు అనంతరం సంప్రదాయబద్ధంగా కల్యాణ వేడుకలను నిర్వహించారు. సహస్ర దీపాలంకరణ, పూలంగి సేవ, ఊంజల్ సేవ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

డైరీ ఆవిష్కరణ

మహబూబాబాద్: జిల్లా కేంద్రంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో బుధవారం తెలంగాణ టీచర్స్ యూనియన్ 2023 డైరీని మంత్రి సత్యవతి రాథోడ్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో భిక్షం, వెంకన్న, ప్రసాద్, ప్రమోద్ పాల్గొన్నారు.

విద్యార్థినికి అభినందనలు



మహబూబాబాద్ రూరల్: జిల్లా స్థాయి ఇంగ్లిష్ స్టోరీ టెల్లింగ్ పోటీల్లో మండలంలోని కంబాలపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని ఏ.సజినీ ప్రథమ స్థానం పొందింది. ఈసందర్భంగా ఉపాధ్యాయ బృందం అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సోమ విష్ణువర్ధన్, ఉపాధ్యాయులు శోభారాణి, సంజీవ్, రామసహాయం శ్రీధర్ రెడ్డి, వెంకట్రామనర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

అండగా ఉంటాం



గూడూరు: ఏన్నో ఏళ్లుగా అటవీ ప్రాంతంలో జీవనం గడిపిన దొరవారి తిమ్మాపురం గ్రామాన్ని, గ్రామస్తులను తరలించాలని చూస్తే సహించేదిలేదని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కత్తి స్వామి, జిల్లా నాయకులు వేం శ్రీనివాస్‌రెడ్డి, మాధవపెద్ది అమరేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని మట్టెవాడ శివారు దొరవారితిమ్మాపురం గ్రామాన్ని బుధవారం మండల కాంగ్రెస్ నాయకులు సందర్శించారు. కార్యక్రమంలో నాయకులు బుడిగె సతీష్‌గౌడ్, తండ యాకాంబ్రంగౌడ్, ఎలమందల శ్రీనివాస్, ముత్యం రవిగౌడ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

గూడూరు: ప్రభుత్వ పాఠశాలల్లో ప్రైవేటుకు దీటుగా విద్యనందించేందుకు సీఎం కేసీఆర్ రాష్ట్ర వ్యాప్తంగా మన ఊరు-మన బడి, మన ఊరు-మన బస్తీ పేరుతో మోడల్ స్కూళ్ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారని ఎమ్మెల్యే బానోతు శంకర్‌నాయక్ అన్నారు. మండలంలోని తీగలవేణి జీపీలో మన ఊరు-మన బడిలో ఎంపికైన జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలను బుధవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రాన్ని సాధించిన సీఎం కేసీఆర్ బంగారు తెలంగాణగా తీర్చిదిద్దేందుకు ఎన్నో పథకాలు అమలు చేస్తూ అభివృద్ధి చేస్తున్నాడని కీర్తించారు. కార్యక్రమంలో సర్పంచ్ వేం శైలజమోహన్ రెడ్డి, ఎంపీపీ బానోతు సుజాత, వైస్ ఎంపీపీ ఆరె వీరన్న, ఎంపీడీఓ రోజారాణి, తహసీల్దార్ అశోక్‌కుమార్, ఏసీజీఈ మందుల శ్రీరాములు, ఎంఈఓ శ్రీదేవి, ఎంపీటీసీ వేం వాసుదేవరెడ్డి, నాయకులు వేం వెంకటక్రిష్ణారెడ్డి, నూకల సురేందర్, బెజ్జం రమేష్, సంపత్‌రావు, భిక్షపతి పాల్గొన్నారు.



గూడూరు: తీగలవేణిలో మన ఊరు-మన బడిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శంకర్‌నాయక్

విద్యతోనే భవిష్యత్

కురవి: పేద విద్యార్థులకు విద్యతోనే భవిష్యత్ ఆధారపడి ఉందని, బాగా చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని డోర్నకల్ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలను మన ఊరు-మన బడి కార్యక్రమంలో భాగంగా మోడల్ స్కూల్‌కు ఎంపిక చేసి అభివృద్ధి చేయగా ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ నూతక్కి పద్మ, ఎంపీటీసీ చిన్నం భాస్కర్, పాఠశాల ఎస్‌ఎంసీ చైర్మన్ కిన్నెర ఉపేందర్, తహసీల్దార్ ఇమ్మానియేల్, ఎంపీడీఓ సరస్వతీ, హెచ్‌ఎం సావిత్రి, ఉపాధ్యాయులు సూరం భాస్కర్, నిరంజన్‌రెడ్డి, మల్లయ్య, లక్ష్మీదుర్గ, సురేష్, రవి పాల్గొన్నారు.



కురవి: ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రెడ్యానాయక్

ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ

గార్ల: సీఎం కేసీఆర్ ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న మన ఊరు-మన బడి ద్వారా ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తలపిస్తున్నాయని ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ అన్నారు. మంగళవారం మండలంలోని పెద్దకిష్టాపురం గ్రామంలో మన ఊరు-మన బడి పథకం కింద సకల సౌకర్యాలతో అభివృద్ధి చేసిన ప్రాథమిక పాఠశాలను ఎమ్మెల్యే లాంఛనంగా ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షులు గంగావత్ లక్ష్మణ్‌నాయక్, సర్పంచ్ గంగావత్ కుంతి, ఎంపీటీసీ ఆలోత్ పరేంగన్, మండల ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డి, తహసీల్దార్ ఈ.రాము, ఎంపీడీఓ జి.రవీందర్, ఎంఈఓ బి.పూల్‌చంద్, ఎస్‌ఎంసీ చైర్మెన్ మోతీలాల్, సీఐ బాలాజీ, డీఈ వెంకట్‌రెడ్డి, ఏఈ శ్రీనివాస్, హెచ్‌ఎం శివ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



గార్ల: పెద్దకిష్టాపురంలో ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే హరిప్రియ

బయ్యారం: బయ్యారంలోని పీజీ రోడ్డు పాఠశాలను ఎమ్మెల్యే హరిప్రియ ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ బిందు, వైస్ ఎంపీపీ గణేష్, మండల ప్రత్యేకాధికారి లక్ష్మీనారాయణ, ఎంపీడీఓ చలపతిరావు, ఎంఈఓ పూల్‌చంద్, హెచ్‌ఎం ఆర్.వెంకటేశ్వర్లు, ఎస్‌ఎంసీ చైర్మన్ గోవింద్, ఉపాధ్యాయురాలు కుమారి పాల్గొన్నారు.

భాషా పండితులకు పదోన్నతి కల్పించాలి



చిన్నగూడూరు: హెచ్‌ఎంకు వినతిపత్రం ఇస్తున్న భాషా పండితులు

చిన్నగూడూరు: భాషా పండితులకు పదోన్నతి కల్పించాలని ఆర్‌యూపీపీటీఎస్ సంఘం సభ్యులు జెడ్పీహెచ్‌ఎస్ చిన్నగూడూరు ప్రధానోపాధ్యాయులు ఎంఏ రెహమాన్‌కు బుధవారం వినతిపత్రం సమర్పించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కొలిపాక శ్రీనివాస్ మాట్లాడుతూ.. బదిలీలు, పదోన్నతులు అందరికీ వర్తించాల్సి ఉండగా భాషా పండితులకు మాత్రం వర్తించకపోవడం ఉపాధ్యాయులకు తీవ్ర నిరాశ కలిగిస్తోందన్నారు. అప్‌గ్రేడేషన్‌పై హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి దృష్టికి తమ సమస్యను పంపించాలనే ఉద్దేశంతో పండిత ఐక్యవేదిక ఆధ్వర్యంలో బుధవారం నుంచి 9,10 తరగతులను బహిష్కరిస్తున్నామన్నారు. జాబ్‌చార్ట్ ప్రకారం 6,7,8 తరగతులకు మాత్రమే బోధిస్తామని ప్రధానోపాధ్యాయులకు మెమోరాండం సమర్పించామన్నారు. కార్యక్రమంలో సభ్యులు సోనీ, సతీష్ తదితరులు ఉన్నారు.

దంతాలపల్లి: భాషా పండితులు బుధవారం మండలకేంద్రంలోని ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బుధారపు శ్రీనువాస్‌కు వినతిపత్రం ఇచ్చారు. ప్రభుత్వం బదిలీలలో అన్యాయం చేయడం వలనే తెలంగాణ పండిట్ పరిషత్ పిలుపు మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు వారు తెలిపారు. పద్మావతి, తిరుమల, రాములు పాల్గొన్నారు.



మరిపెడలో..

పెద్దవంగర: ప్రభుత్వం ప్రస్తుత షెడ్యూల్ నందు భాష పండితులకు, పీఈటీలకు పదోన్నతులు కల్పించాలని భాషా పండితులు వెంకన్న, శ్రీనివాస్ డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల్లోని హెచ్‌ఎం విజయ్‌కుమార్‌కు 9,10 తరగతులకు బోధన నిలిపి వేస్తున్నట్లు పలు డిమాండ్‌లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో గొట్టిముక్కల షౌకత్‌అలీ, శ్రీనివాస్ రెడ్డి, సైదయ్య, విజయ్‌కుమార్, శ్రీధర్, యాకయ్య, సువర్ణ, తదితరులు పాల్గొన్నారు.

మరిపెడ: భాషా పండితులు, వ్యాయామ ఉపాధ్యాయులను అప్‌గ్రేడ్ చేస్తామని చెప్పి ఇప్పటి వరకు చేయకపోవడం పట్ల భాషా పండితులు, వ్యాయామ ఉపాధ్యాయులు మరిపెడ మండల కేంద్రంలోని సీతారాంపురం ప్రభుత్వ పాఠశాలలో బుధవారం నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రాజకుమారి, వెంకన్న, సురేష్, సఫియాభేగం, ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

విభజన హామీల అమలు కోసం పోరు

నెహ్రూసెంటర్: రాష్ట్ర విభజన హామీలను అమలు చేయడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, రాష్ట్ర విభజన హామీల అమలుకై సీపీఐ ఆధ్వర్యంలో ఎర్రదండు లాంగ్ మార్చ్ నిర్వహిస్తున్నామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. సీపీఐ ఉమ్మడి జిల్లాల సమావేశం జిల్లా కేంద్రంలోని వీరభవన్‌లో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి మొండిచేయి చూపారని, బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు, ఖాజీపేట కోచ్ ఫ్యాక్టరీ, ప్రాణహిత చేవేళ్ల ప్రాజెక్టులకు జాతీయ హోదా వంటి హామీలను కేంద్రం విస్మరించిందని విమర్శించారు. పోడుభూముల సమస్యల రోజు రోజుకు పెరుగుతుందని, కాలయాపన చేయకుండా అర్హులైన వారందరికీ పోడు పట్టాలు ఇచ్చి, పోడు రైతులపై పెట్టిన కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. మార్చి 17వ తేదీ నుంచి ఏప్రిల్ 17 తేదీ వరకు బయ్యారం టూ హైదరాబాద్‌కు ఎర్రదండు లాంగ్ మార్చ్ పాదయాత్ర నిర్వహిస్తున్నామని, 30రోజులు 700 కిలోమీటర్లు పాదయాత్ర సాగుతుందని వెల్లడించారు. ఈ సమావేశంలో సీపీఐ మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, భూపాలపల్లి, ములుగు జిల్లా కార్యదర్శులు బి.విజయసారథి, మేకల రవి, కర్రె బిక్షపతి, రాజ్‌కుమార్, తోట మల్లికార్జున్‌రావు, నాయకులు బి.అజయ్‌సారథిరెడ్డి, తమ్మెర విశ్వేశ్వర్‌రావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్రీనివాసరావు

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



ర్యాలీగా వెళ్తున్న నాయకులు

మహబూబాబాద్: కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఐఎఫ్టీయూ జిల్లా కార్యదర్శి బి.సూర్యం డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాల అమలు కోసం ఐఎఫ్టీయూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో చలో కలెక్టరేట్ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ముందుగా ర్యాలీ నిర్వహించి కలెక్టరేట్‌లో ఏఓ వెంకటరమణకు వినతిపత్రంను అందజేశారు. ఈసందర్భంగా సూర్యం మాట్లాడుతూ.. కార్మికుడి సహజ మరణానికి రూ.1,30,000 ఉండగా దానిని రూ.5లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. ప్రమాద మరణానికి రూ.6లక్షలు ఉండగా దానిని రూ.10లక్షలకు పెంచాలన్నారు. శాశ్వత అంగవైకల్యానికి రూ.10లక్షలు ఇవ్వాలని పెళ్లి కానుక, ప్రసూతి సహాయంగా లక్ష రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు భాస్కర్‌రెడ్డి, మౌలానా, సాంబయ్య, యాకయ్య, నాగరాజు, మురళి, వెంకన్న పాల్గొన్నారు.

మహిళా సంక్షేమానికి ప్రభుత్వం కృషి

పెద్దవంగర: మహిళా సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం తోడ్పాటునిస్తుందని ఎంపీపీ ఈదురు రాజేశ్వరి, జెడ్పీటీసీ శ్రీరాం జ్యోతిర్మయి అన్నారు. బుధవారం మండల కేంద్రంతోపాటు చిట్యాల గ్రామంలో సెర్ప్, స్త్రీనిధి ఆధ్వర్యంలో మహిళలకు కుట్టు శిక్షణ శిబిరాలను సర్పంచ్ వెనుకదాసుల లక్ష్మీ రామచంద్రయ్య శర్మతో కలిసి వారు ప్రారంభించారు. ఈసందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. 150 మంది మహిళలకు శిక్షణ తరగతులను 50మంది చొప్పున 90 రోజుల పాటు కుట్లు నేర్పిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని 18 ఏళ్లు పైబడిన మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మీ, బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి శ్రీరాం సంజయ్, శ్రీరాం సుధీర్, ఎంపీటీసీ శ్రీనివాస్, బోనగిరి లింగమూర్తి, ఎడవెల్లి నారాయణ రెడ్డి, ఉప సర్పంచ్ శ్రీరాం రాము పాల్గొన్నారు.



కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభిస్తున్న ఎంపీపీ రాజేశ్వరి

సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడొద్దు



మహబూబాబాద్ అర్బన్: మాట్లాడుతున్న సీఐ మోహన్

మహబూబాబాద్ అర్బన్: చాలా మంది విద్యార్థులు సైబర్ నేరగాళ్ల ఉచ్చులో ఇరుకుంటున్నారని సీసీఎస్ సీఐ గంధ్రాతి మోహన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని టీటీడబ్ల్యూఆర్‌డీసీ మహిళా గురుకులంలో షీటీం, సైబర్ క్రైం, భరోసా ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమానికి సీఐ హాజరై మాట్లాడా.. సైబర్ నేరం జరిగిన వెంటనే 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కి ఫోన్ చేయాలని, మహిళలు, బాలికల భద్రత కోసం ప్రభుత్వం షీటీంలను ఏర్పాటు చేసిందన్నారు. ఎవరైన ఆకతాయిలు వేధిస్తే వెంటనే 100కు ఫోన్ చేయాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జి.సంధ్యారాణి, సైబర్ క్రైమ్ ఎస్సై మురళీధర్, కానిస్టేబుల్ శ్రీకాంత్, షీటీం ఎస్సై సునంద, ఏఎస్సై ఆనంద్, మహిళ పీసీలు ఊర్మిళ, భరోసా ఎస్సై దీపిక, కోఆర్డినేటర్ జ్యోష్ణ, రేణుక, అధ్యాపకులు పాల్గొన్నారు.

మరిపెడ: మండల కేంద్రంలోని సీతారాంపురం పాఠశాల విద్యార్థులకు మరిపెడ ఎస్సైలు సంతోష్, ఝాన్సీలు అవగాహన సదస్సు నిర్వహించారు. సైబర్ మోసాలకు గురైనప్పుడు సైబర్‌క్రైం పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలని, 1930 నంబర్‌కు ఫోన్ చేయాలని, దగ్గరలో ఉన్న పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయులు రాంమోహన్, విజయలక్ష్మి పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

డోర్నకల్: డోర్నకల్, గుండ్రాతిమడుగు రైల్వే స్టేషన్ల మధ్య జీఆర్‌పీ పోలీసులు గుర్తు తెలియని మృతదేహాన్ని గుర్తించారు. డోర్నకల్ జీఆర్‌పీ ఎస్సై కె.శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం డోర్నకల్ గుండ్రాతిమడుగు రైల్వేస్టేషన్ల మధ్య కిలోమీటర్ నంబర్ 458/0 వద్ద సుమారు 35-40 సంవత్సరాల వయసు కలిగిన వ్యక్తి మృతదేహాన్ని గుర్తించినట్లు తెలిపారు. మృతుడు రైలు నుంచి జారి పడి మృతి చెంది ఉండవచ్చని తెలిపారు. ఖమ్మం అన్నం సేవా సంస్థ సభ్యుల సహకారంతో మృతదేహాన్ని ఖమ్మం ఏరియా ఆస్పత్రికి తరలించి మార్చురీలో భద్రపర్చినట్లు తెలిపారు. మృతదేహం వివరాలు తెలిసిన వారు 94406 27537, 94903 32143 నంబర్లకు సంప్రదించాలని కోరారు.



సంతృప్తి ఇవ్వని బడ్జెట్

మహబూబాబాద్ అర్బన్: ఆదాయపు పన్ను మినహాయింపు పరిమితిని స్వల్పంగా పెంచి మధ్య తరగతి వేతన జీవులకు భారీ ఊరట పేరుతో ప్రచారం చేసుకోవడం సమంజసం కాదని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఏ.మురళీకృష్ణ, ఎస్‌కే యాకుబ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సంఘ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ. పాత, కొత్త పన్ను విధానాన్ని కొనసాగిస్తూ క్రమంగా పాత పన్ను విధానాన్ని ఎత్తివేయడానికి కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తున్నట్లు బడ్జెట్ ద్వారా స్పష్టమైందన్నారు. కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ ప్రతిపాదించిన బడ్జెట్ సగటు వేతన జీవులకు ఏమాత్రం సంతృప్తిని కలిగించలేదన్నారు. కార్యక్రమంలో నాయకులు సంజీవ, శ్రీనివాస్, ప్రవీణ్, ప్రసాద్, వెంకట్ పాల్గొన్నారు.

రేపు శివపార్వతుల కల్యాణం

గార్ల: మండలంలోని రాజ్యాతండాలో కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా ఈనెల 3వ తేదీన నిర్వహించనున్న శివపార్వతుల కల్యాణ మహోత్సవానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరుకావాలని అర్చకుడు శ్రీనివాస్ బుధవారం తెలిపారు.

అధికారులు ప్రజాప్రతినిధులను గౌరవించాలి

డోర్నకల్: ప్రభుత్వ అధికారులు ప్రజాప్రతినిధులను గౌరవించాలని డోర్నకల్ శాసన సభ్యులు డీఎస్ రెడ్యానాయక్ ఆదేశించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం జరిగిన సర్వసభ్య సమావేశంలో ఇటీవల మరణించిన కన్నెగుండ్ల సర్పంచ్ బందారు దర్గయ్య మృతికి ఎమ్మెల్యేతో సభా సభ్యులు మౌనం పాటించి నివాళులర్పించారు. అనంతరం గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ఉత్తమ గ్రామపంచాయతీగా ఎంపికైన చాప్లాతండా సర్పంచ్ పాండునాయక్‌ను ఎమ్మెల్యే సన్మానించారు. అనంతరం జరిగిన సమీక్షలో మాట్లాడుతూ.. పీహెచ్‌సీలో ప్రసవాలకు సంబంధించి వైద్య, ఐకేపీ సిబ్బంది మధ్య సమన్వయం లోపించడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ దరంసోత్ బాలునాయక్, జెడ్పీటీసీ సభ్యురాలు పాడిశెట్టి కమలారామనాథం, ఎంపీడీఓ అపర్ణ, తహసీల్దార్ స్వాతిబిందు, పీఆర్ డీఈ మహేష్, పీఏసీఎస్ చైర్మన్లు కొండపల్లి సీతారామిరెడ్డి, చేరెడ్డి బిక్షంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అధికారులపై ఎమ్మెల్యే ఆగ్రహం

దంతాలపల్లి: మండలం ఎస్ఆర్ఎస్‌పీ అధికారులపై ఎమ్మెల్యే రెడ్యానాయక్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కాల్వలపై ఎస్ఆర్ఎస్‌పీ అధికారుల తీరు బాగాలేదని, ఇలా అయితే రైతుల పంటలు ఎలా పండుతాయని ప్రశ్నించారు. ప్రభుత్వ వైద్యశాలలో ప్రసవాల సంఖ్య పెంచాలన్నారు. అనంతరం కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ ఒలాద్రి ఉమా, జిల్లా పరిషత్ ఉపాధ్యక్షుడు నూకల వెంకటేశ్వరరెడ్డి, రైతు సమన్వయ సమితి కోఆర్డినేటర్ మల్లారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ సంపెట రాము, తహసీల్దారు శివాని, ఎంపీడీఓ విజయలక్ష్మి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



డోర్నకల్: సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రెడ్యానాయక్

సంక్షిప్త సమాచారం

ల్యాబ్ పరికరాల వితరణ



డోర్నకల్: మండలంలోని చిలుకోడు జెడ్పీహెచ్‌ఎస్‌కు ఖమ్మంకు చెందిన గణిత ఉపాధ్యాయుడు మహ్మద్ రియాజ్ రూ.3వేల విలువైన ల్యాబ్ పరికరాలు, జాతీయ క్రీడలకు ఎంపికైన పాఠశాల విద్యార్థి మాకుల్‌కు ట్రాక్ సూట్ కోసం రూ.వెయ్యి అందించాడు. గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు కాడెం బాబు మాకుల్‌కు రవాణా ఖర్చుల కోసం రూ.వెయ్యి అందించాడు. హెచ్‌ఎం జి.పద్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యారంగానికి మొండి చేయి

దంతాలపల్లి: బడ్జెట్‌లో విద్యారంగానికి కేంద్ర ప్రభుత్వం మొండిచేయి చూపిందని దళిత బహుజన విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు పోలెపాక వెంకన్న అన్నారు. బుధవారం మండలకేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. విద్యారంగానికి పదిశాతం నిధులు కేటాయించాల్సిన ప్రభుత్వం ఆరుశాతం కేటాయించి విద్యపై చిన్నచూపు చూస్తుందన్నారు.

సెల్‌ఫోన్ చోరీ

డోర్నకల్: చెన్నై నుంచి హైదరాబాద్ వెళ్తున్న రైలులో ఓ మహిళకు చెందిన సెల్‌ఫోన్ చోరీకి గురైంది. డోర్నకల్ జీఆర్‌పీ ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్‌కు చెందిన అనూష మంగళవారం రాత్రి చెన్నై నుంచి వస్తున్న చార్మినార్ ఎక్స్‌ప్రెస్‌లో హ్యాండ్ బ్యాగును ప్రక్కన పెట్టి వాష్‌రూంకు వెళ్లగా గుర్తు తెలియని వ్యక్తులు బ్యాగును చోరీ చేశారు. అందులోని ఖరీదైన ఐఫోన్ పోయిందంటూ జీఆర్‌పీ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

పోరాటాల ఫలితంగానే మార్కుల పెంపు

కేసముద్రం: ఎస్సై, కానిస్టేబుల్ అభ్యర్థులకు న్యాయం చేయాలంటూ యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో చేపట్టిన పోరాట ఫలితంగానే, తెలంగాణ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు 7మార్కులు కలిపేందుకు నిర్ణయం తీసుకుందని యువజన కాంగ్రెస్ జిల్లా సోషల్‌మీడియా కోఆర్డినేటర్ షేక్ ముజీబ్ అక్తర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

బెల్ట్‌షాపులను నిర్మూలించాలి

తొర్రూరు రూరల్: మండలంలోని సోమారం గ్రామంలో విచ్చలవిడిగా కొనసాగుతున్న బెల్ట్ షాపులను నిర్మూలించాలని కోరుతూ సర్పంచ్ సంపత్, ఉప సర్పంచ్ ప్రభాకర్‌లకు గ్రామస్తులు వినతిపత్రాన్ని బుధవారం అందించారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు మేకల కుమార్, సమ్మయ్య, గ్రామస్తులు నవీన్, సంతోష్, నరేష్, రాజు, అరుణ్, భరత్, ముని పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం

బయ్యారం: మండలంలోని మొట్లతిమ్మాపురంలో కొమరం భీం యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నాలుగు మండలాల క్రికెట్ పోటీలను బుధవారం భద్రాద్రి జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య ప్రారంభించారు. కార్యక్రమంలో మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, సర్పంచ్ స్వరూప పాల్గొన్నారు.

నూరుశాతం పదోన్నతులు కల్పించాలి



గార్ల: ఏజెన్సీ ప్రాంతాల్లో విధులు నిర్వర్తిస్తున్న గిరిజన ఉపాధ్యాయులకే నూరుశాతం పదోన్నతులు, నియామకాలు కల్పించాలని జిల్లా టీటీజేఏసీ చైర్మన్ బానోత్ వీరునాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం గార్లలో ఎమ్మెల్యే బానోత్ హరిప్రియకు ఆయన సంఘం ఉపాధ్యాయులతో కలిసి వినతిపత్రం అందజేశారు. టీటీజేఏసీ రాష్ట్ర నాయకులు శివ, మోకాళ్ల రామచంద్రు, శ్రీరాంబాబు, శ్రీనివాస్, భోజ్యానాయక్, రాము, వీరు, శ్రీను ఉన్నారు.

కొనసాగుతున్న 'కంటివెలుగు'

కురవి: కంటివెలుగు ఇంటికి వెలుగును ఇస్తుందని వైస్ ఎంపీపీ దొంగలి నర్సయ్య అన్నారు. బుధవారం సీరోలు మండలంలోని చింతపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో కంటివెలుగు కార్యక్రమంలో నర్సయ్య కంటి పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో సతీష్‌గౌడ్, వార్డు సభ్యులు రవి, రవీందర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

డీఎస్పీ గ్రామ కమిటీ ఎన్నిక

కేసముద్రం: మండలంలోని కేసముద్రంవిలేజ్ దళిత శక్తి ప్రోగ్రాం(డీఎస్పీ) గ్రామ నూతన కమిటీని ఎన్నుకున్నట్లు మండల అధ్యక్షుడు కొమ్ము రామక్రిష్ణ మహారాజ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామ అధ్యక్షుడిగా వద్దూరి కల్యాణ్, ఉపాధ్యక్షుడు బిర్రు సాంబయ్య, ప్రధాన కార్యదర్శి వల్లందాసు శ్రీనాథ్, సహాయ కార్యదర్శి వినీత్, కోశాధికారి కొమ్ము సుమంత్, గౌరవ సభ్యులు పెండ్యాల రవికుమార్, సుధాకర్‌లను ఎన్నుకున్నట్లు ఆయన పేర్కొన్నారు.

విరమించుకోవాలి

కేసముద్రం: గూడూరు మండలంలోని మట్టెవాడ గ్రామశివారు ఆదివాసీ గూడెం, దొరవారి తిమ్మాపురంగూడెంను ఖాళీ చేసే కుట్రను జిల్లా అధికారులు విరమించుకోవాలని పీసీసీ సభ్యుడు గుగులోతు దస్రూనాయక్ బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.


వేతనాలు పెంచాలి

నెహ్రూసెంటర్: మహబూబాబాద్ ఆర్టీసీ హైర్ బస్సు డ్రైవర్ల వేతనాలు పెంచాలని సీఐటీయూ పట్టణ కార్యదర్శి కుమ్మరికుంట్ల నాగన్న అన్నారు. అద్దె బస్సుల డ్రైవర్లు తమ వేతనాలు పెంచాలని పట్టణంలో నిరసన వ్యక్తం చేస్తూ యజమానులకు బుధవారం సమ్మె నోటీసులు ఇచ్చారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు చందు, శ్రావణ్, నాయకులు రవీందర్, వెంకటేష్, మహేందర్, శ్రీశైలం, ఐలయ్య పాల్గొన్నారు.

ఉద్యమకారుడి మృతి

డోర్నకల్: తెలంగాణ రాష్ట్ర కోసం ఉద్యమించిన ఉద్యమకారుడు, మాజీ డీఆర్‌యూసీసీ సభ్యులు గుండ్ల రమేష్(63) మంగళవారం అర్ధరాత్రి అనారోగ్యంతో మృతి చెందాడు. పలువురు బీఆర్‌ఎస్ నాయకులు సంతాపం తెలిపారు.

ప్రమాదకరంగా సైడు కాల్వ గుంత



డోర్నకల్: మున్సిపాలిటీ పరిధిలోని ప్రధాన కూడలీ గాంధీ సెంటర్‌లోని గాంధీ విగ్రహం ప్రక్కన సైడు కాల్వ గుంత ప్రమాదకరంగా మారింది. ఇక్కడ రోడ్డు ఇరుకుగా ఉండటం నిత్యం వాహనాల రాకపోకలు జరుగుతుండడంతో పలువురు వాహనదారులు, పాదాచారులు అదుపు తప్పి కాల్వ గుంతలో పడి గాయాలపాలయ్యారు.

అంగన్‌వాడీ కేంద్రం సందర్శన

గూడూరు: మండలంలోని లైన్‌తండా అంగన్‌వాడీ కేంద్రంలో భోజనం తిన్న చిన్నారులు అస్వస్థతకు గురి కావడంతో బుధవారం డీడబ్ల్యూఓ నర్మద, సీడీపీఓ నీలోఫర్ అజ్మీ, ఎంపీడీఓ, తహసీల్దార్, ఎస్సై అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. లైన్‌తండా అంగన్‌వాడీ కేంద్రంలో మధ్యాహ్న భోజనం తిన్న ముగ్గురు చిన్నారుల్లో జశ్వంత్ అస్వస్థతకు గురై పడిపోగా, మరో ఇద్దరు ఇంటికి వెళ్లి అస్వస్థతకు గురయ్యారు. వీరి పరిస్థితి గుర్తించిన కుటుంబ సభ్యులు వెంటనే గూడూరు ఆస్పత్రికి తరలించారు. జశ్వంత్ పరిస్థితి విషమంగా ఉండడంతో హన్మకొండలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. మరో ఇద్దరు చిన్నారులు కోలుకున్నారు. దీంతో సీడీపీఓ, డీడబ్ల్యూఓ నర్మదకు సమాచారం అందించడంతో హుటాహుటిన లైన్‌తండా అంగన్‌వాడీ కేంద్రానికి చేరుకున్నారు. పిల్లల పరిస్థితిపై తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు.

కలుపు నివారణ మందు పిచికారీ.. ఎండిన వరి



కొత్తగూడ: వరిలో కలుపు నివారణ మందు పిచికారీ చేస్తే పొలం ఎండిపోయిన సంఘటన కొత్తగూడ మండలం రేన్యతండాలో వెలుగు చూసింది. రైతు అజ్మీరా యాక తనకున్న నాలుగున్నర ఎకరాల్లో నాటు వేశాడు. నాటు వేసిన సమయంలో కలుపు మందు వేయలేదు. దీంతో కలుపు నివారణ కోసం వరంగల్ జిల్లా నర్సంపేట పట్టణంలోని మన గ్రోమోర్ సెంటర్‌కు వెళ్లి నామినీ గోల్డ్ మందు కావాలని అడిగాడు. దీంతో నిర్వాహకుడు ఓ కంపెనీకి చెందిన రెండు మందులు ఇచ్చి నామినీ గోల్డ్ కంటే బాగా పని చేస్తుందని చెప్పాడు. నిర్వాహకుడు చెప్పినట్లు అజ్మీరా యాక వరికి మందు పిచికారీ చేశాడు. దీంతో కలుపుతో పాటు నాటు ఎర్రబారి చనిపోతుంది. పలుమార్లు మన గ్రోమోర్ సెంటర్ యాజమాన్యానికి చెబితే పొలం వద్దకు వచ్చి చూస్తామని చెప్పి ఇప్పుడు ఏం చేసుకుంటావో చేసుకో అంటూ బెదిరిస్తున్నారని రైతు లబోదిబోమంటున్నాడు. అధికారులు చొరవ తీసుకుని న్యాయం చేయాలని బాధిత రైతు కోరుతున్నాడు.